ADVERTISING
నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.
Contact Number 9059328777

రంగారెడ్డి ఆదివారం 15-03-2026 సంపుటి: 01 సంచిక : 270 వేల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని
Ranga Reddy Sunday 15-03-2026 Volume :01 Issue: 270 Cost: 2 Pages:08 Editor : Katta HimaPavani

# శబరిమలలో మహిళలకు ప్రవేశం





## యూ టర్న్ తీసుకున్న కేరళం ప్రభుత్వం

- 50 ఏళ్ల లోపు వారికి అనుమతి కుదరదు
- సుప్రీంకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

**తిరువనంతపురం, మార్చి14(నేటి దర్శిని):** 50 ఏళ్లలోపు మహిళల్ని శబరిమల ఆలయంలోకి అనుమతించే అంశంపై కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల్ని ఆలయంలోకి అనుమతించకూడదని నిర్ణయించింది. ఈ మేరకు కేరళం సీఎం పినరయి విజయన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో దీనిపై ఆమోదం లభించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. భక్తుల మనోభావాలు, ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాల్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని కాపాడాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

-మిగతా 2 లో



# అమెరికాలో వీసా మోసాలు

- 11మంది భారతీయుల అరెస్ట్
- నేరం రుజువైతే జైలుశిక్ష తప్పదు

**వాషింగ్టన్**
అమెరికాలో కొందరు భారతీయులు అక్రమంగా నివసించేందుకు చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఛేదించింది. వీసా మోసానికి కుట్ర పన్నారనే ఆరోపణలపై నాలుగు రాష్ట్రాల్లో చేపట్టిన ఆపరేషన్‌లో 11 మందిని అరెస్ట్ చేసింది. సదరు వ్యక్తులు నేర బాధితులుగా డ్రామాలాడి, ఇమ్మిగ్రేషన్ పొందేందుకు సాయుధ దోపిడీలకు పాల్పడ్డారని ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఎఫ్‌బీఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముఠా ప్రణాళికలో భాగంగా మసాచుసెట్స్ రాష్ట్రంలోని లిక్కర్ షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కన్వీనియెన్స్ స్టోర్లలో నకిలీ దోపిడీలు జరుగుతాయి. ఈ డ్రామాలో ఓ వ్యక్తి ఆయుధంతో షాపులోకి ప్రవేశించి అక్కడి గుమాస్తాను బెదిరించి నగదుతో ఉడాయించగా.. ఇదంతా సీసీటీవీ కెమెరాల్లో రికార్డ్ అవుతుంది. ఈ విషయం కాస్త ఆలస్యంగా పోలీసులకు తెలుస్తుంది. ఆ తర్వాత దొంగ దొరక్కుండా జాగ్రత్తపడతాడు. స్టోర్‌లో దోపిడీ నిర్వహించేందుకు యజమాని, అలాగే బాధితుడిగా నటించినందుకు గుమాస్తాకు డబ్బులు చెల్లిస్తారు. ఈ డ్రామా అంతా పూర్తయ్యాక తామే ఈ దోపిడీ చేశామని పోలీసులకు సమాచారమిచ్చి.. ఆ సాక్ష్యాలతో 'యు' నాన్ ఇమిగ్రెంట్ వీసాకు దరఖాస్తు చేసుకుంటుంటారు. అయితే.. మొత్తం వ్యవహారాన్ని రాంభాయ్ పటేల్ అనే

-మిగతా 2 లో

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

## కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత

- సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత
- అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దు
- కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- ప్రజలు సంయమనంతో ఉండాలని సూచన
- ఎల్పీజి డిస్ట్రిబ్యూటర్స్‌తో మంత్రి ఉత్తమ్ సమీక్ష

**హైదరాబాద్, మార్చి14(నేటి దర్శిని):** తెలంగాణలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని, కేవలం కమర్షియల్ సిలిండర్ల విషయంలోనే కొంత కొరత ఉందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ , ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ వినియోగదారులకు

-మిగతా 2 లో





# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

- కరీంనగర్ మహాలశక్తి ఆలయం నుంచి కొండగట్టుకు
- స్థానిక కార్పోరేటర్లతో కలసి పదివేలమంది నడక
- రాజకీయాలకు సంబంధం లేదన్న కేంద్రమంత్రి
- కొండగట్టును అభివృద్ధి చేస్తామని హామీ

**కరీంనగర్, మార్చి14(నేటి దర్శిని):** కొండగట్టును అభివృద్ధి చేసే బాధ్యత తాము తీసుకుంటామని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర పేరిట కరీంనగర్‌లోని మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు మహా పాదయాత్ర చేపట్టారు. కేంద్ర మంత్రితో పాటు ఇటీవల గెలుపొందిన కార్పొరేటర్లు ఆయన వెంట ఉన్నారు. కరీంనగర్ మేయర్ పీఠం భాజపా కైవసమైతే కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కలిసి కొండగట్టు అంజన్న ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకుంటానని ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బండి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు, 10 వేల మంది కార్యకర్తలతో కలిసి సంజయ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తన కొండగట్టు పాదయాత్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. 'అంజన్న ఆశీర్వాద' పేరుతో శనివారం మహా పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు.

-మిగతా 2 లో



# పెట్రోల్, డీజిల్‌లకు కొరత లేదు

- బాటిళ్లలో వాటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు
- తమిళనాడు ఘటనలో డీలర్‌షి రద్దు చేసిన కేంద్రం
- ఇంధన సరఫరాలపై పెట్రోలియం శాఖ కీలక ఆదేశాలు జారీ

**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ముందు జాగ్రత్తగా పెట్రోల్ , డీజిల్ ను.. సీసాలు, డబ్బాలు లాంటి విడి పాత్రలలో నిల్వ చేసుకోవడంపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన జారీచేసింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపింది. ఇటీవల తమిళనాడులోని ఒక రిటైల్ అవుట్‌లెట్‌లో వినియోగదారుడికి లూజ్ కంటైనర్‌లో పెట్రోల్ పోసిన విషయం తమ దృష్టికి వచ్చిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది భద్రతా నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని, అందుకే ఆ పెట్రోల్ బంక్ లైసెన్స్‌ను తక్షణమే సస్పెండ్ చేసి,

-మిగతా 2 లో

# గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్

- దేశ ప్రయోజనాలకు భిన్నంగా కాంగ్రెస్ వైఖరి
- యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు
- అసోం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు




**గౌహతి, మార్చి14(నేటి దర్శిని):** మధ్యప్రాచ్యంలో యుద్ధం ప్రభావం దేశంపై సాధ్యమైనంత తక్కువగా ఉండేలా కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. అయితే ఇందుకు భిన్నంగా ఏమాత్రం బాధ్యతలేని విపక్షంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తోందని ఆరోపించారు.

-మిగతా 2 లో

# మొజ్తబా ఆచూకీ చెబితే... 10మిలియన్ డాలర్లు


- రివార్డ్ ఫర్ జస్టిస్ ప్రకటించిన అమెరికా



**వాషింగ్టన్,**
ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు పగ్గాలు చేపట్టినా తమ తదుపరి టార్గెట్ అయనే అవుతారని ఇంతకుముందే ప్రకటించిన అమెరికా ఆ దిశగా మరో ముందడుగు వేసింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ఆచూకీ కానీ, ఆయనకు సంబంధించిన కీలక సమాచారం కానీ అందించిన వారికి భారీ రివార్డు ప్రకటించింది. ఆచూకీ ఇచ్చిన వారికి 10 మిలియన్ డాలర్లు అంటే రూ.92 కోట్లు నజరానా ఇస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. 'రివార్డ్ ఫర్ జస్టిస్' కార్యక్రమం క్రింద ఈ బౌంటీ ఇస్తామని తెలిపింది. అమెరికా విదేశాంగ నిర్వహించే ఒక ముఖ్యమైన ఉగ్రవాద నిరోధక కార్యక్రమమే

-మిగతా 2 లో

# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతులు పూజలు



- రుద్రాభిషేకం, కుంకుమార్చనలో పాల్గొన్న గవర్నర్
- కన్నడ భక్తుల రాకతో కిటకిటలాడుతున్న క్షేత్రం

**శ్రీశైలం, మార్చి14(నేటి దర్శిని):** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను శనివారం తెల్లవారు జామున తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్‌శుక్లా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గవర్నర్ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గవర్నర్ దంపతులకు దేవస్థానం అర్చకులు, పండితులు వేదాశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

-మిగతా 2 లో

# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భవిష్యత్

- రైతులు దండిగా ఆయిల్ పామ్ సాగు చేయాలి
- నర్మెట్ల ఆయిల్ పామ్ సందర్శించిన మంత్రులు
- 22న సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తున్నాం
- వెల్లడించిన తుమ్మల నాగేశ్వర రావు



**సిద్దిపేట, మార్చి14(నేటి దర్శిని):** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులకు పెట్టుబడి, ఎరువులు అన్నీ అందిస్తున్నామని తెలిపారు. తాను మంత్రిగా వచ్చిన సమయానికి ఆయిల్ పామ్ టన్ను రూ.12వేలు ఉండేదని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టన్ను ధర రూ.20 వేలకు పైగా పెంచామని చెప్పారు. సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ సందర్శించారు.

-మిగతా 2 లో

# శబరిమలలో మహిళలకు ప్రవేశం

మొదటి తరువాయి

అయితే, త్వరలోనే కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, రాజకీయ కోణంలోనే ఎల్డీఎఫ్ (లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్) ఈ నిర్ణయం తీసుకుందని రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. శబరిమల ఆలయంలోకి వయసుతో సంబంధం లేకుండా మహిళలకు ప్రవేశం కల్పించాలని కొన్నేళ్లక్రితం ఆందోళనలు చెలరేగాయి. అయితే, ఈ నిర్ణయాన్ని శబరిమల ఆలయ యాజమాన్య బాధ్యతలు చూసే ట్రావెన్‌కోర్ దేవస్తాన బోర్డు వ్యతిరేకించింది. ఎప్పటినుంచో ఉన్న సంప్రదాయం ప్రకారం.. మహిళలకు మెనుస్ట్రువల్ సైకిల్ ఉండే పదేళ్ల వయసు నుంచి 50 ఏళ్ల వయసు మహిళల్ని ఆలయంలోకి అనుమతించబోమని తెలిపింది. ఈ నిర్ణయాన్ని 2018లో ప్రభుత్వం వ్యతిరేకించింది. అన్ని వయసుల వారికి ఆలయ ప్రవేశం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం అందరు మహిళలు ఆలయంలోకి వెళ్లొచ్చని తెలిపింది.

అయితే, ఇప్పుడు ఈ నిర్ణయాన్ని ఎల్డీఎఫ్ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. పాత సంప్రదాయాల ప్రకారమే 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై నిషేధం విధిస్తామని కోర్టుకు తెలిపింది. ఈ అంశంలో ప్రభుత్వ నిర్ణయం ఏంటో చెప్పేందుకు తుది గడువు కావడంతో తాజా నిర్ణయాన్ని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. ఈ అంశంపై వచ్చే నెల 7 నుంచి సుప్రీంకోర్టులో వాదనలు జరగనున్నాయి. మరోవైపు ప్రభుత్వం యూటర్న్ తీసుకోవడంపై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. ఇంతకాలం ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడిన వారిపై నమోదైన కేసుల సంగతేంటని ప్రశ్నిస్తున్నాయి. ఈ నిరసనలకు సంబంధించి నమోదైన కేసుల్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది.

# అమెరికాలో వీసా మోసాలు

మొదటి తరువాయి

వ్యక్తి నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇలా వీసాలు పొందేందుకు బాధితులుగా నటించేవారు అతడికి భారీగా డబ్బులిస్తారని సమాచారం. అతడే ఈ ప్లాన్‌ను అమలు చేస్తుంటాడు. కాగా.. రాంభాయ్ పటేల్, అతడి డ్రైవర్‌ను అధికారులు ఇప్పటికే పట్టుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన వారిలో జితేంద్ర కుమార్ పటేల్, మహేశ్ కుమార్ పటేల్, సంజయ్ కుమార్ పటేల్, అమితాబెన్ పటేల్, సంగీతాబెన్ పటేల్, మితుల్ పటేల్, రమేష్‌భాయ్ పటేల్, రోనక్ కుమార్ పటేల్, సోనాల్ పటేల్, మింకేశ్ పటేల్ ఉన్నారు. వీరిని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో హాజరుపరచనున్నట్టు తెలుస్తోంది. వీసా మోసానికి పాల్పడినట్టుగా నేరం రుజువైతే.. మూడేళ్ల జైలు శిక్ష, 2.50 లక్షల డాలర్లు భారత కరెన్సీలో సుమారు రూ.2.10 కోట్లు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది.

# పెట్రోల్, డీజిల్‌లకు కొరత లేదు

మొదటి తరువాయి

సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకున్నామని వెల్లడించింది. ఇలాంటి చర్యలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో దేశంలోని అన్ని రిటైల్ అవుట్‌లెట్‌లు, డీలర్లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. ఇంధనాన్ని సరఫరా చేసేటప్పుడు భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. పెట్రోల్ వంటి మండే స్వభావం ఉన్న ఇంధనాన్ని అసురక్షిత పద్ధతుల్లో నిల్వ చేయడంవల్ల తీవ్రమైన అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ తాజాగా కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదని భరోసా ఇచ్చింది. కంగారు పడి కొనుగోళ్లకు దిగవద్దని ప్రజలకు సూచించింది. సాధారణ కంటెయినర్‌లలో పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించింది. ఇక గృహవినియోగ ఎల్‌పీజీ సిలిండర్‌ల విషయంలో నెలకొన్న భయాందోళనలపై ఇటీవల మార్కెటింగ్ ఆయిల్ రి÷నైరీ విభాగం జాయింట్ సెక్రెటరీ కూడా స్పందించారు. ఎల్‌పీజీ డెలివరీల్లో ఎలాంటి ఆటంకాలు లేవని అన్నారు. గ్యాస్ ఉత్పత్తిని భారతీయ రి÷నైరీలు 30 శాతం మేర పెంచాయని అన్నారు. గృహ వినియోగదారులు, ఆసుపత్రులు, విద్యాసంస్థలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ జాగ్రత్త తీసుకున్నట్టు తెలిపారు. ఇక కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌లకు సంబంధించిన వ్యవహారాల నిర్వహణను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు బదిలీ చేసింది. కీలక రంగాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరఫరా జరిగేలా మార్గదర్శకాల రూపకల్పన, అమలు బాధ్యతలను రాష్ట్రాలకు బదిలీ చేసింది.

# గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్న కాంగ్రెస్

మొదటి తరువాయి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అస్సాంలోని సిల్చార్‌లో శనివారంనాడు పర్యటించారు. రూ.23,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.22,864 కోట్లతో సిల్చార్-మేఘాలయలోని షిల్లాంగ్ మధ్య నిర్మించనున్న యాక్సెస్ కంట్రోల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, అస్సాం ప్రజలను హింస, ఉగ్రవాదం వైపు కాంగ్రెస్ తప్పుదారి పట్టించిందని, అయితే ఇవాళ రాష్ట్రంలో సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇవాళ ప్రపంచవ్యాప్తంగా యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. దేశ ప్రజలపై ఆ ప్రభావం తగ్గించడానికి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. వారి రక్షణ, శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా కాంగ్రెస్ వ్యవహరిస్తుందని ఆశిస్తాం. అయితే దేశ ప్రయోజనాల పరిరక్షణలో కాంగ్రెస్ మరోసారి విఫలమైందని విమర్శించారు. దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. మోదీని దూషించడమే పనిగా పెట్టుకుంది. అంతర్జాతీయంగా భారత్ శీఘ్ర అభివృద్ధిని సాధించడం కొన్ని శక్తులకు ఇష్టంలేదు. అలాంటి శక్తుల చేతిలో కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిందని మోదీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ పార్టీకి అస్సాం గురించి కానీ, దేశం గురించి కానీ ఎలాంటి విజన్ లేదని మోదీ తప్పుపట్టారు. మోదీని దూషించడం, అబద్దాలు, వదంతుల ప్రచారంతో ప్రజలను తప్పుదారి పట్టించడమే ఆ పార్టీకి తెలుసునని అన్నారు. బీజేపీ ప్రభుత్వం యువతకు అనేక అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆలోచనలు ఎక్కడ ఆగిపోతాయో, అక్కడి నుంచే తమ పని ప్రారంభమవుతుందని, అభివృద్ధిలో వెనుకబడిన వారికి ప్రాధాన్యత ఇవ్వడమే బీజేపీ ప్రధాన మంత్రమని చెప్పారు. మీరు కాంగ్రెస్‌ను ఇక్కడినుంచి ఎప్పుడో తరిమికొట్టారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లోనూ ప్రతి రాష్ట్రం ఆ పార్టీకి గుణపాఠం చెప్పనుంద న్నారు. ఇటీవల దిల్లీలో జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి నిరసనలు తెలపడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. మొత్తం దేశం ఈ చర్యను ఖండించిందన్నారు. ఓటమితో నిరాశ చెందిన కాంగ్రెస్ దేశం పైనే దాడికి దిగిందన్నారు. నిరాశతో దుస్తులు చింపుకోవడం తప్ప.. వాళ్లకి మరేమీ మిగల్లేదని ఎద్దేవా చేశారు.

# తెలంగాణలో గ్యాస్ కొరత లేదు

మొదటి తరువాయి

గ్యాస్ కొరత లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత మాత్రమే ఉందని చెప్పారు. అయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అవసరంగ లేకున్నా ముందస్తుగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని ఉత్తమ్ సూచించారు. కావాలని గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్పీజీ ఆయిల్ సరఫరా సంస్థలతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్..' ప్రస్తుత పరిస్థితులపై నిన్న అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాం. రాష్ట్రంలో 810 మంది ఎల్పీజీ డిస్టిబ్యూటర్ లు ఉన్నారు. 1.3 కోట్ల డోమాస్టిక్ కన్జుమర్స్ ఉన్నారు. 7.5 లక్షల కమర్షియల్ కన్జుమర్స్ ఉన్నారు. నెలకు యావరేజ్ 60 లక్షల సిలిండర్లు డొమెస్టిక్ వాడుతున్నారు. కమర్షియల్ సిలిండర్ విషయంలోనే కొరత ఏర్పడుతోంది. డొమెస్టిక్ కన్జుమర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఎలాంటి కొరత లేదు. ఆందోళనతో ముందస్తుగా అవసరం లేకున్నా గ్యాస్ బుక్ చేసుకుంటున్నారు. గృహ అవసర సిలిండర్లకు కొరత లేదు. కమర్షియల్ సిలిండర్లను కేంద్రం 20 శాతం సప్లై చేస్తోందన్నారు. కమర్షియల్ సిలిండర్ల విషయంలో కేంద్రానికి లేఖ రాశాం. ప్రతి రోజు 2.15 లక్షల ఎల్పీజీ డొమాస్టిక్ సిలిండర్లు సప్లై చేస్తారు. నిన్న మొన్న 2.3 లక్షలు సప్లై చేశారు. కమర్షియల్ సిలిండర్లు రోజుకు 23 వేలు సప్లై చేసే వాళ్లు. కానీ ప్రస్తుతం 6200 సిలిండర్లు మాత్రమే ఇస్తున్నారు. స్కూల్స్, కాలేజెస్,



సెంటర్, స్టేట్ గవర్నమెంట్ సంస్థలకు కమర్షియల్ సిలిండర్లు విషయంలో ప్రాధాన్యత ఇస్తున్నాం. సివిల్ సప్లై భవన్ లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని. ఎవరైన కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించినా..బ్లాక్ మార్కెట్ చేసినా హెల్ప్ లైన్ 180042500344 కు కాల్ చేయొచ్చని' మంత్రి ఉత్తమ్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1.3 కోట్ల మంది యాక్టివ్ గృహ వినియోగదారులు ఉన్నారని, వారికి సరిపడా సిలిండర్లను ఆయిల్ కంపెనీలు అందిస్తున్నాయని మంత్రి తెలిపారు. గతంలో రోజుకు సగటున 2.15 లక్షల సిలిండర్లు సరఫరా అయ్యేవని, ప్రస్తుత డిమాండ్‌ను బట్టి దానిని 2.3 లక్షలకు పెంచినట్లు ఆయన వెల్లడించారు. గ్యాస్ కొరత ఉందన్న ఆందోళనతో వినియోగదారులు అనవసరంగా ఓవర్ బుకింగ్ చేసి సిస్టమ్‌ను ఓవర్‌లోడ్ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలు వాడే 19 కేజీల కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం తగ్గుదల ఉన్న మాట వాస్తవమేనని మంత్రి అంగీకరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొత్త మార్గదర్శకాల వల్ల గతంలో ఉన్న సరఫరాలో కేవలం 20 శాతం మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉందని ఆయన వివరించారు. గతంలో రోజుకు 23,000 కమర్షియల్ సిలిండర్లు సరఫరా అయ్యే చోట, ఇప్పుడు కేవలం 6,200 మాత్రమే వస్తున్నాయని, ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యాస్ పంపిణీ సక్రమంగా జరిగేలా చూడటంతో పాటు, అక్రమ నిల్వలను అరికట్టేందుకు రాష్ట్ర , జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. గృహ అవసరాల సిలిండర్లు పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మొత్తానికి, సామాన్యుడి వంటింట్లో మంట ఆరిపోకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు.

# బండి సంజయ్ అంజన్న ఆశీర్వాద యాత్ర

మొదటి తరువాయి

కరీంనగర్ మహాశక్తి అమ్మవారి దేవాలయం నుంచి కొండగట్టు అంజన్న ఆలయం వరకు ఈ పాదయాత్ర కొనసాగుతోంది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బీజేపీ ప్రజాప్రతినిధులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగుతోంది. సాయంత్రం కొండగట్టుకు ఈ పాదయాత్ర చేరుకోనుంది. బీజేపీ శ్రేణులు ఈ పాదయాత్రకు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పది వేలమంది పాల్గొనేలా ఎ÷-లాన్ చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కొండగట్టు అంజన్న ఆశీర్వాదం, ప్రజల ఆశీర్వాదంతో కరీంనగర్ కార్పొరేషన్‌లో విజయం సాధించామని పేర్కొన్నారు. మహాశక్తి ఆలయం నుంచి కొండగట్టు వరకు ఈ పాదయాత్ర చేస్తున్నామని బండి సంజయ్ వివరించారు. పదోతరగతి పరీక్షలు ఉన్నందున విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ పాదయాత్ర కొనసాగుతోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది ఎన్డీయే భాగస్వామ్య ప్రభుత్వమని చెప్పుకొచ్చారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ ఎన్డీయే కూటమి మిత్రుడేనని తెలిపారు. కొండగట్టు అభివృద్ధికి టీటీడీ



నిధులను పవన్ కల్యాణ్ కేటాయించారని ప్రస్తావించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు కొండగట్టు అభివృద్ధిని పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ప్రసాదం స్కీమ్ కింద కొండగట్టు, వేములవాడ, ఇల్లందకుంట ఆలయాలను అభివృద్ధి చేస్తామని కేసీఆర్ హయాంలో చెప్పారని.. కానీ చర్యలు మాత్రం చేపట్టలేదని ఆగ్రహించారు. ఎంఐఎంను తాము భూస్థాపితం చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. 'సర్వేజన సుఖీనోభవంతు మా నినాదం' అని చెప్పుకొచ్చారు. తుంగతుర్తి ఎమ్మెల్యే బ్రాహ్మణుల మీద మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ హిందూ వ్యతిరేకి అని ఆరోపించారు. హిందువుల గురించి అనుచితంగా మాట్లాడే పరిస్థితి కాంగ్రెస్ సర్కార్‌లో వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మళ్లీ ఎలా గెలిస్తారో చూస్తామని హెచ్చరించారు. తుంగతుర్తిలో ఆయన పతనం ప్రారంభ మైందని ధ్వజమెత్తారు. హిందు దేవుళ్లను మోసం చేసి మరో దేవుడు దగ్గరకు ఆయన ఎలా వెళ్తారని ప్రశ్నించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మీద మత విద్వేషాలను రెచ్చగొట్టినందుకు కేసు పెట్టాలని ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# ఆయిల్ పామ్‌కు ఉజ్వల భివష్యత్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ పంట వేయాలని సూచించారు. ఈ పంటకు నీటి సమస్య, మార్కెట్ సమస్య లేదన్నారు. అన్ని విధాలా రైతులకు లాభాలు ఇచ్చే పంట ఆయిల్ పామ్ అని చెప్పారు. నర్మెట్టలో త్వరలో రైతు మేళా నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రైతులు ధైర్యంగా ఆయిల్ పామ్ సాగుచేయాలన్నారు. రైతులు క్రాప్ డైవర్షన్ వైపు మారాలని లేకపోతే రైతులకు నష్టం జరుగుతుందన్నారు . సిద్దిపేట జిల్లా నర్మేటట్టలో మార్చి 22న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని మంత్రి పొన్నంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి తుమ్మల.. 'తెలంగాణకు సిద్దిపేట కేంద్రంగా ఉంటుంది అందుకే ఇక్కడ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం మొదలు పెట్టాం. ఇక్కడ రూ. 40 కోట్లతో రిఫైరీ ఆయిల్ యూనిట్ కూడా ప్రారంభిస్తాం. రైతులు పండించిన వేస్టేజ్ గెలలతో విద్యుత్ తయారు చేస్తాం. కేంద్రం వరి ధాన్యం కొనబోమని చెబుతోంది.రబీలో కూడా అత్యధికంగా మనమే వరి పండిస్తున్నాం. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో ఎక్కువ సాగు చేస్తున్నారు. నా వరి పొలంలో కూడా ఆయిల్ పామ్ సాగు చేస్తున్నా. ఇక్కడ ఉన్న బాలకృష్ణ దళిత రైతు ధైర్యంతో ఆయిల్ పామ్



సాగు చేసి లాభాలు పొందుతున్నారు. ప్రతి రైతు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి... సాగు కావాల్సిన అన్ని సబ్సిడీ ప్రభుత్వం మీకు ఇస్తుంది. నేను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు రూ. 12 వేలకు టన్ను ఉంటే... కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే ఇప్పుడు రూ.21 వేలకు టన్ను చేశాం. రైతులను కష్టాల నుంచి తప్పించాలన్న.. గ్రామాలు పచ్చగా ఉండాలన్నా హార్టికల్చర్ క్రాప్స్ వేయాలి. నేను నా సొంత పొలంలో వక్క సాగు చేస్తున్న... ఆయిల్ పామ్ సాగులో ఇంటర్ క్రాప్ పంటలకు కూడా సబ్సిడీ ఇస్తాం. 30 జిల్లాల్లో పామ్ ఆయిల్ ఎ÷-లాంటేషన్ జరుగుతుంది . రైతులకు ఎలాంటి ఇబ్బంది లేని పంట పామ్ ఆయిల్ . తెలంగాణలోని అన్ని జిల్లాల రైతులను ఇక్కడికి పిలుస్తాం. వారికి కావాల్సిన స్టాల్స్ అన్ని పెడతాం' అని అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ ... మధ్య గుజరాత్ వెళ్లినప్పుడు అక్కడ పాల సేకరణ గ్రామీణ స్థాయి నుండి జరుగుతుంది..అక్కడ అమూల్ పాలు దేశ వ్యాప్తంగా వ్యాపించాయి. ఇక్కడ ఆయిల్ పామ్ ఆయిల్ తుమ్మల నాగేశ్వరరావు స్టార్ట్ చేశారు.. ప్రతి జిల్లాలకు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించాలని బావిస్తున్నాం. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ గతంలో ప్రతిపాదనలు జరిగినప్పటికీ 300 కోట్లు కేటాయించి

తుమ్మల నాగేశ్వరరావు పనులు పూర్తి చేయించారు. ఈ ప్రాంత రైతాంగానికి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ ప్రాంత రైతులు ఆయిల్ ఫామ్ పై దృష్టి సారించాలి..మా ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంట పండదు అనే అపోహ నుండి తుమ్మల బయటకు తీసుకొచ్చారు. ఇక్కడి రైతులు ఆయిల్ ఫామ్ పై ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలనీ ఈ ప్రాంత రైతులను కోరుతున్నా అని పొన్నం అన్నారు.

# శ్రీశైలంలో గవర్నర్ శుక్లా దంపతలు పూజలు

మొదటి తరువాయి



ఈవో వారికి స్వామి అమ్మ వార్ల చిత్రపటాలను అందజేశారు. శ్రీశైల క్షేత్ర విశేషాల గ్రంథాన్ని గవర్నర్‌కు ఈవో బహూకరించారు. గవర్నర్‌గా నియమితులు అయ్యాక శుక్లా శు క్రవారం శ్రీశైలం చేరుకున్నారు. వేకువ జామునే ఆయన ఆలయం చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇదిలావుంటే శ్రీశైలంలో భారీగా రద్దీ పెరగింది. వరు సెలవులకు తోడు కన్నడ భక్తుల రాకతో శ్రీశైలం కిటకిట.

## మొజ్తబా ఆచూకీ చెబితే...

# 10మిలియన్ డాలర్లు

మొదటి తరువాయి

'రివార్డ్ ఫర్ జస్టిస్'. ఈ ప్రోగ్రాం కింద అంతర్జాతీయ నేరస్తులు, నెట్‌వర్క్‌ల సమాచారం అందించి, వారిని పట్టుకోవడంలో సహాయపడిన వారికి మిలియన్ డాలర్ల రివార్డు ఇస్తుంటారు. అమెరికన్ల రక్షణ, జాతీయ భద్రత బలోపేతం చేయడమే ఆర్ఎఫ్‌జే లక్ష్యం.



కాగా, అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించిన వ్యక్తుల జాబితా మొజ్తాబాతో పాటు ఆయన కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అస్గర్ హెజాజీ, సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్ అలీ లారీజానీ, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఆచూకీ తెలిపిన వారికి రివార్డుతో పాటు వారిని వేరే ప్రాంతానికి తరలించే సదుపాయం కూడా కల్పిస్తామని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.

# పండిట్ దీన్ దయాళ్ చూపిన దార్శనికతే ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు మార్గదర్శకం

- **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**

**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా శివనగర్ మండలంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026 మండల కార్యశాల మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ అధ్యక్షతన ఓ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ యొక్క సైద్ధాంతిక పునాది ప్రధానంగా ఏకాత్మ మానవతావాదం, హిందుత్వ, సాంస్కృతిక జాతీయవాదం, జాతీయ సమగ్రత , ఏకత్వం, సామాజిక,ఆర్థిక విధానాలు అనే అంశాల గురించి కార్యకర్తలకు వివరించారు. బిజెపి యొక్క అధికారిక సిద్ధాంతం 1965లో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించారన్నారు. మనిషిని కేవలం ఆర్థిక జీవిగా కాకుండా, శరీరం, మనస్సు, బుద్ధి , ఆత్మల కలయికగా పరిగణించి, సమాజంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అంత్యోదయ పథకాలు




అందాలని ఆకాంక్షిస్తుందని తెలిపారు. పార్టీ, దేశ సేవలో ప్రతి కార్యకర్త నిస్వార్థ సైద్ధాంతిక నిబద్ధతతో పనిచేయాలని, పండిట్ దీన్ దయాళ్ బోధనలను దైనందిన జీవితంలో ఆచరించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన పార్టీ ప్రధాన సిద్ధాంతమైన 'ఏకాత్మ మానవ దర్శనం' గురించి, ఆ సమగ్ర దృక్పథం ఎలా రూపుదిద్దుకుందో కార్యకర్తలకు సవివరంగా దిశానిర్దేశం చేసి, నాడు పండిట్ దీన్ దయాళ్ చూపిన ఈ దార్శనికతేనేడు ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనకు, సంక్షేమ విధానాలకు ప్రధాన మార్గదర్శకం అన్నారు. 1953లో రాజస్థాన్‌లో దీన్ దయాళ్ స్వయంగా శ్రీకారం చుట్టిన ఈ క్రమశిక్షణాయుత శిక్షణా సంప్రదాయమే బీజేపీకి అతిపెద్ద సంస్థాగత బలం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రశిక్షణ జిల్లా కన్వీనర్ కందిమల్ల మహేష్, జిల్లా ఐటి ఇన్చార్జి ఆడేపు వెంకటేష్, జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్, బైరి శ్యాంసుందర్, ప్రశిక్షణ మండల కన్వీనర్ వైట్ల గణేష్, మండల నాయకులు తమ్మిశెట్టి క్రాంతికుమార్, తాళ్లపెల్లి శ్రీనివాస్, సూర శ్రీనివాస్, బండి సుజాత, మార్త ఉషారాణి, జారతి దేవక్క , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 7వ వార్డులో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన తల్లోజు ఆచారి....



**ఆమనగల్,మార్చి14( నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ మునిసిపాలిటీ పరిధిలోని 7వ వార్డు వెంకటేశ్వర కాలనీలో జాతీయ ఓబీసీ మాజీ మెంబర్ తల్లోజు ఆచారి ఆమనగల్ మున్సిపాలిటీ చైర్మన్ పత్యా నాయక్ తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. యుజిడి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపుల కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ నిరంజన్ నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ షరీఫ్,మాజీ కౌన్సిలర్ విజయ్ కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణా నాయక్, మరియు శ్రీశైలం, బ్రహ్మం, పాలాది శ్రీను, తోట మల్లేష్ ,గుజ్జరి శ్రీను, గోరటి నరసింహ, మునిసిపాలిటీ సిబ్బంది,పట్టణ ప్రముఖులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉర్కొండ మండలం అభివృద్ధి నా ధ్యేయం





- **బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**

**మిడ్జిల్, మార్చి14 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ఉర్కొండ మండల కేంద్రంలో ఎంపీ డీకే అరుణ నిధులతో ఊరుకొండ మండల పరిధిలో నీ పలు గ్రామాల అభివృద్ధి పనులకు 70 లక్షల మంజూరు చేయించి, పలు గ్రామాల్లో సిసి రోడ్ అండర్ డ్రైనేజ్ తదితర ముఖ్య పనులకు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నా ఊరుకొండ మండలం దేశంలో ఎక్కడ లేని విధంగా మండలంలోని మండలాన్ని, గ్రామాల్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యమని త్వరలో మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధికి తోర్పడతాం అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉప ఉపసర్పంచ్, వార్డు సభ్యులు జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రారంభమైన 10వ తరగతి పరీక్షలు..





**ఆమనగల్, మార్చి14(నేటి దర్శని ప్రతినిధి)** పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని మండల విద్యాధికారి పాండు అన్నారు. పరీక్ష మొదటి రోజైన శనివారం నాడు మొదటి లాంగ్వేజ్ అని విద్యార్థినీ విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబరును సరి చూసుకుంటూ తమకు ఏ పరీక్ష హాల్లో వేశారో అని పరీక్ష ఇన్విజిలేటర్లను అడిగి తెలుసుకుంటున్నారు. ఆమనగల్లు మండల పరిధిలో పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు 524 మందికి రెండు ఎగ్జామినర్ సెంటర్లను ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి పాండు అన్నారు. ఒకటి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మరియు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడానికి ఏర్పాటు చేశారన్నారు. 524 మంది విద్యార్థులకు 523 మంది విద్యార్థులు పరీక్ష రాయగా , ఒక విద్యార్థి గైర్హాజరయ్యారని తెలిపారు. ఎంఈఓ పాండు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎగ్జామ్స్ సెంటర్లలో అన్ని ఏర్పాట్లను చేశామని ఆయన అన్నారు.

# జర్నలిస్టులకు ఎమ్మెల్యే వరం

- **సొంత ఖర్చుతో హెల్త్ కార్డులు, బీమా సౌకర్యం**
- **ఆరోగ్య భద్రతకు హామీ.. జర్నలిస్టుల కుటుంబాలకు జియంఆర్ భరోసా**

**మిడ్జిల్, మార్చి 14, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** జర్నలిస్టుల సంక్షేమం మరియు వారి కుటుంబాల ఆరోగ్య భద్రతకు తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని దేవరకద్ర ఎమ్మెల్యే స్పష్టం చేశారు. శనివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి, జర్నలిస్టుల హెల్త్ కార్డుల సమస్యపై



వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ కీలక హామీలు ఇచ్చారు. ప్రభుత్వ పరంగా జర్నలిస్ట్ లకు వచ్చే సహాయంతో పాటు, తన వంతుగా వ్యక్తిగత సహాయం కూడా అందిస్తానని పేర్కొన్నారు. నూతన అక్రిడేషన్ కార్డులు వచ్చిన వెంటనే, అర్హులైన జర్నలిస్టులందరికీ తన సొంత ఖర్చులతో హెల్త్ కార్డులు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తన సొంత నిధులతో యాక్సిడెంటల్ భీమాని సైతం చేయిస్తానని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో కష్టపడే జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్య విషయంలో రాజీ పడకుండా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయం పట్ల జర్నలిస్ట్ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# .స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల్లో ప్రతిభ కనపరచాలి: కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్ ను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆవిష్కరించారు. జిల్లా స్థాయి నుంచి గరిష్ట సంఖ్యలో విద్యార్థులు ఎంపిక కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించాలనుకునే బాలబాలికలు ఈనెల 28 నుంచి ఏప్రిల్ 1 వ తేదీలోపు జిల్లా స్థాయిలో జరిగే శారీరక పరీక్షలకు హాజరు కావాలని సూచించారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, గణేష్ పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో అభివృద్ధి ధ్యేయంగా కృషి: ఎమ్మెల్యే

**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తుందని, అందులో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలో ముందు వరుసలో నిలుపుతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. వరంగల్ నగరంలోని 67వ డివిజన్లో రూపాయల 13 లక్షలతో సిద్ధార్థ నగర్ కమ్యూనిటీ హాల్ లో డైనింగ్ హాల్ నిర్మాణం, డాక్టర్స్ కాలనీలో 65 లక్షలతో పార్కు ప్రహరీ గోడ నిర్మాణం, మౌలిక వసతులు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా అభివృద్ధి జరుగుతుందని, పనులు నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా ఎమ్మెల్యే చొరవతో నె స్టిల్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూపాయలు 10 లక్షల వ్యయముతో మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. హనుమకొండ ప్రభుత్వ అభ్యసన్నోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత మర్కజి పాఠశాల ,శాయంపేట ప్రభుత్వ పాఠశాల ,కాజీపేట



బాపూజీ నగర్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, పారిశుద్ధం పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు

# శ్రీ భద్రకాళి అమ్మవారి సన్నిధిలో సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్



**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి అమ్మవారిని సినీ గేయ రచయిత కాసర్ల శ్యామ్ శనివారం దర్శించుకున్నారు. విజయవంతమైన చిత్రాలలో తన పాటలతో ప్రేక్షకుల మన్ననలు పొంది, ఇటీవల జాతీయ సినీ గేయ రచయితగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ వరంగల్ లో చిన్నతనం నుంచి భద్రకాళి అమ్మవారి దగ్గరనే ఎక్కువ సమయం గడిపే వాడిని, తన మిత్రుడు అమ్మవారి దర్శనం చేసుకోవాలని తీసుకోవచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయం అర్చకులు శేషు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు.

## సంపాదకీయం

# అకాలజ్ఞత




కొన్ని శతాబ్దాల క్రితమే మన విష్ణుశర్మ పంచతంత్ర కథలు చెప్పాడు. అందులో మిత్రలాభం, మిత్రభేదం అనేవి మొదటి రెండు. వీటిల్లో అనేక ఉపకథలు, ఒకదానికొకటి లింకవుతూ సాగుతాయి. పిల్లలందరికీ తెలిసే ఉంటుంది. ఇప్పటికీ పంచతంత్ర కథలు చాలా ఆసక్తిగా చదివిస్తాయి. అందులో పక్షులు, జంతువులు పాత్రదారులుగా ఉన్నా, మనుషులకు వర్తించే నీతిని, ధర్మాలను, నిజాయితీలను వర్ణిస్తూ సాగుతాయి. మిత్రభేదం మొదటికథలో అడవిరాజు సింహం, ఒక పెంపుడు ఎద్దు మధ్య అసహజ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడం ఈ తంత్రం యొక్క ఇతివృత్తం. ఎద్దుతో స్నేహం కారణంగా రాజు తన ప్రజల పట్ల తన బాధ్యతలను మరచిపోయినప్పుడు, అతని మంత్రి, ఒక నక్క, ఆ స్నేహాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఒక పథకం వేస్తుంది.ఇకపోతే, మిత్రలాభంలో కూడా చాలా కథలున్నాయి. కథ చెప్తూ విష్ణుశర్మ ఇలా అంటాడు. 'సామాన్యుడు కానీ, రాజ్యాధికారి కానీ, తమ జీవిత కాలంలో మంచి మిత్రులను సంపాదించుకోవాలి. ఆపదలో ఆదుకున్నవాడే నిజమైన మిత్రుడు' అని కథలో వివరిస్తాడు. నేను కథలు వివరించను గానీ, లఘుపతనకుడనే కాకి, హిరణ్యకుడు "శత్రువులతో మైత్రి ప్రమాదకరం. కాగిన నీళ్లయినా అగ్నిని ఆర్పేస్తాయి. వైరం రెండు విధాలు. పుట్టుకతో వచ్చేది సహజవైరం. ఏదో సరిపడక వచ్చేది మామూలు వైరం. కుక్కా పిల్లి కలిసి ఉండగలవా? నీటికి నిప్పుకీ మధ్య నేస్తం కుదురుతుందా? నేను నీ ఆహారాన్ని, నువ్వు నన్ను తినేదానివి. నీకూ నాకూ స్నేహం కుదరదు" అని స్పష్టంగా చెప్పేస్తుంది ఎలుక.ఇప్పుడీ పంచతంత్ర కథల ప్రస్తావనెందుకంటే, శతాబ్దాల క్రితం చేసిన ఆలోచనలను ఇప్పుడు మన పాలకులు చేయకపోవటం, ఎంత బుద్ధిహీనత! హిరణ్యకుడి ద్వారా విష్ణుశర్మ మనకేం చెప్పాడు. ఎవరు మనకు నిజమైన మిత్రులు, ఎవరు శత్రువులు, అనే విచక్షణ ఉండాలని కదా! చెప్పింది. మరి మన నేటి పాలకులకు ఆ వివేచన ఉందా? మొత్తం ప్రపంచాన్ని, ప్రపంచ దేశాల వనరులను కాజేయడానికి, దేశాలపై దాడులు చేస్తూ విధ్వంసాన్ని, యుద్ధాన్ని సృష్టిస్తున్న సామ్రాజ్యవాద అమెరికాను మిత్రుడుగా భావించడం, దానితో మిత్రుత్వాన్ని నెరపడం కొరవితో తలగోక్కోవడం కాదా! అమెరికాతో అంటకాగుతూ యుద్ధ చిచ్చును రగిల్చిన ఇజ్రాయిల్ దేశం మనకెట్లా స్నేహితుడవుతాడు! కొన్ని తరాలుగా,చారిత్రకంగా భౌగోళికంగా మన భారతదేశానికి మిత్రునిగా ఉన్నాడు.సంస్కృతి సంప్రదాయాల కలబోతలు, ఆదాన ప్రదానాలు కలిగిన సంబంధాన్ని శత్రుసంబంధంగా మార్చే నీతిబహ్య చర్యలు, దేశ ప్రజల ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగపడవు. అంతేకాదు హీనచరితగా మిగిలిపోతుంది. వెనిజులాపైన అమెరికా దాడిచేసి, మదురో దంపతులను అంతర్జాతీయ న్యాయసూత్రాలనన్నింటినీ అతిక్రమించి ఎత్తుకుపోతే మన దేశ పాలకుడు మోడీ ఏమీ మాట్లాడలేదు. శాంతికోసం ఆలింగనం చేసుకునివచ్చిన మరుక్షణంలో ఇజ్రాయిల్ నెతన్యాహు ఇరాన్‌పై బాంబులు వేస్తే ఒక్కమాటా మాట్లాడలేదు. వందలాది మందిని చంపుతున్నా, ఆఖరికి ఇరాన్ దేశాధినేతను చంపినా కిమ్మనలేదు.అనేక సంవత్సరాలుగా రష్యా మనదేశానికి చౌకగా చమురు సరఫరా చేస్తుంటే, అమెరికా ఆదేశించిందని మానేసి, అమెరికా ఎక్కువ ధరకు ఇస్తున్న చమురును కొనటం ఎంత దిగజారుడుతనం. ఇప్పుడేమయింది! ఇదివరకెన్నడూ లేని కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నామని మంత్రి హర్దీప్‌సింగ్‌పురి పార్లమెంటులో ప్రకటించాడు. గ్యాస్‌బండ ధరలు పెరుగుతున్నాయి. అసలు గ్యాసు దొరకక చిన్న చిన్న వ్యాపారాలు హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. ఐటీ ఉద్యోగులకు క్యాంటీన్‌లు లేకుండా పోయాయి. రోడ్డుపక్క మిర్చిబజ్జీల బండ్లు మూసేశారు. ఆర్డర్లు లేక స్విగ్గీ, జొమాటోలో ఉపాధి పొందుతున్నవారు రోడ్ల పాలవుతున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత దేశం మొత్తం పెరిగింది.నెతన్యాహు, ట్రంప్ మిత్రులను అడుగుతాడా సహాయం! ఇట్లాంటి యుద్ధ సమయంలో కూడా ఇంత లొంగుబాటును ప్రదర్శించినప్పటికీ, భారత్‌పై సుంకాలు పెంచుతామని అమెరికా ప్రకటిస్తున్నది. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. చమురు నౌకలను కదలకుండా ఆపేసింది. మిత్ర దేశాలకు మాత్రం సరఫరాకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. నిన్ననే ఒక చమురు నౌక మన తీరానికి చేరుకున్నట్లు ప్రకటించారు. ఇప్పటికి కూడా మన దేశానికి ఎవరు మిత్రులు, ఎవరు శత్రువులు? తెలుసుకోకపోతే నష్టపోయేది ప్రజలు. తెలిసీ ఉన్మాదుల పక్కన చేరితే, ప్రజలు ఊరుకోరు. కొంత ఆలస్యంగానైనా మీ అసలు రూపాన్ని తెలుసుకుంటారు. ఎందుకంటే, ప్రజలు పంచతంత్ర కథలన్నీ చదువుకొని ఉన్నారు.

# మిస్సింగ్ కేసులపై ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆందోళన

- తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాలకు నోటీసులు
- రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ : మార్చి14(నేటి దర్శిని):**
దేశంలో మిస్సింగ్ కేసులు పెరగటంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఆందోళన వ్యక్తం చేసింది. అనేక రాష్ట్రాల్లో మిస్సింగ్ కేసులు పెరుగుతున్నాయని, తప్పిపోతున్న వారి ఆచూకీ కనిపెట్టటంలో విఫలమవుతున్నారని మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఈ కేసును ఎన్‌హెచ్‌ఆర్‌సి సుమోటోగా స్వీకరించింది. ఈ విషయంపై వివరణ ఇవ్వాలని ఐదు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, పోలీసు డిజిపిలకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది.




తెలంగాణతోపాటు బీహార్, ఒడిశా, మహారాష్ట్ర, రాజస్థాన్‌లకు నోటీసులు పంపింది.

**బీహార్‌లో అత్యధికంగా మిస్సింగ్ కేసులు**
వార్తా కథనాల ప్రకారం.. బీహార్‌లో 2013 నుంచి ప్రతి సంవత్సరం 12వేల నుంచి 14వేల వరకు మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో పిల్లలకు సంబంధించిన కేసులే అధికంగా ఉన్నాయి. అదృశ్యమైన చిన్నారుల్లో తక్కువమంది ఆచూకీ మాత్రమే కనుగొంటున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం మానవ అక్రమ రవాణా కేసులు ఎక్కువగా నమోదవుతున్న రాష్ట్రాల్లో ఒడిశా, బీహార్, తెలంగాణ, మహారాష్ట్ర ఉన్నాయి. అదృశ్యమైన చిన్నారులు భిక్షాటన, వెట్టిచాకిరీ చేయించడం, వ్యభిచారం తదితర అక్రమ కార్యకలాపాల్లోకి నెట్టివేయబడుతున్నారనే విమర్శలున్నాయి. ఈ పరిస్థితి నిజమైతే ఇది మానవ హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన తీవ్రమైన సమస్య అని ఎన్‌హెచ్‌ఆర్‌సి పేర్కొంది. సంబంధిత రాష్ట్రాలు మిస్సింగ్ కేసులను తగ్గించడానికి తీసుకున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

# గాజాలో కొనసాగుతున్న మారణహోమం

- ఇజ్రాయిల్ దాడిలో మరో ఏడుగురు మృతి

**గాజా మార్చి14(నేటి దర్శిని):**
గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో మరో ఏడుగురు మరణించారు. గత మూడు రోజుల్లో ఇజ్రాయిల్ ఈ ఘాతుకానికి పాల్పడింది. శనివారం ఉదయం ఖాన్ యూనిస్‌లోని ఒక పోలీసు పోస్ట్‌పై ఇజ్రాయిల్ దళాలు దాడి చేశాయి. ఈ దాడిలో పాలస్తీనాకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. గురువారం ఇద్దరిని, శుక్రవారం మరో ముగ్గురిని ఇజ్రాయిల్ దళాలు హత్య చేశాయని గాజా వర్గాలు తెలిపాయి. కాల్పుల



విరమణ ప్రకటించిన తరువాత కూడా ఇజ్రాయిల్ దళాలు దాడులు చేస్తూనే ఉండటంతో గత ఆరు నెలల్లో 658 మంది మరణించారు. వేలాదిమంది తీవ్రంగా గాయపడ్డారు.

**గాజాలో ఇసుక తుపాను**
గాజాలో ఇసుక తుపాను వీచడంతో శిథిలావస్థలో ఉన్న గుడారాల్లో నివసిస్తున్న కుటుంబాలు నానా అవస్థలు పడ్డాయి. చెల్లా చెదురుగా పడిపోయిన వస్తువులన్నింటినీ తిరిగి తమ గుడారానికి చేర్చుకుంటూ పెద్దలు, పిల్లలు కనిపించారు. రఫా సరిహద్దును ఇజ్రాయిల్ మూసివేయడంతో సహాయం అందక ఆకలితో గాజా వాసులు అలమటిస్తున్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో తీవ్రంగా గాయపడిన వేలాదిమంది విదేశాలకు చికిత్స కోసం వెళ్లేందుకు ఎదురుచూస్తున్నారు. వారిలో పిల్లలే అత్యధికం.

# అమెరికాలోనూ 'ఎస్ఐఆర్'!

- వ్యతిరేకుల ఓట్ల తొలగింపునకు ట్రంప్ యోచన
- సెనెట్‌లో నిలిచిన బిల్లు

**వాషింగ్టన్ మార్చి14(నేటి దర్శిని):**
ఓ వైపు ఇరాన్‌పై యుద్ధం... మరో వైపు ఈ ఏడాది నవంబరులో జరగాల్సిన మధ్యంతర ఎన్నికలు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి. డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చవుతోంది. ఇంటా బయటా విమర్శలు సరేసరి. ఈ నేపథ్యంలోనే అమెరికా ఎన్నికల వ్యవస్థను తమ పార్టీకి అనుకూలంగా మార్చుకునేందుకు ట్రంప్ ఎత్తులు వేస్తున్నారు. మన దేశంలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న 'ఎస్ఐఆర్' ప్రక్రియ తరహాలోనే అక్కడ కూడా ఓటర్ల వెరిఫికేషన్ చేపట్టి, తన వ్యతిరేకుల, వలసదారుల ఓట్లను తొలగించేందుకు యోచిస్తున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ఎన్నికలలో సమగ్రతను, కచ్చితత్వాన్ని కాపాడడం దేశ ప్రాధాన్యత అని చెబుతూ... ఈ కసరత్తు చేస్తున్నారు. డూప్లికేట్ లేదా అనర్హులను ఏరివేసేందుకు ఓటరు పరిశీలన ప్రక్రియను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నదని చెబుతున్నారు. ఎన్నికల జాబితాలను తరచుగా సమీక్షించాలని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజాస్వామిక వ్యవస్థలపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని, ఎన్నికలలో అవకతవకలకు అవకాశం ఉండదని



చెప్పారు. ప్రతి ఓటరూ తన పౌరసత్వాన్ని నిరూపించుకునేందుకు అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందంటూ ప్రతిపాదించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. అయితే అది సెనెట్‌లో నిలిచిపోయింది. వచ్చే వారం సెనెట్‌లో చర్చకు వస్తుందని భావిస్తున్నారు.

**రుజువులు చూపాల్సిందే!**
అమెరికాలో ఫెడరల్ వ్యవస్థ ఉంది. దీని ప్రకారం ఆయా రాష్ట్రాలు తమ సొంత పద్ధతులను అనుసరించే అవకాశముంది. వాటిని నీరుగార్చి.. ఎన్నికల ప్రక్రియను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చాలా రాష్ట్రాల్లో పౌరసత్వానికి సంబంధించి డాక్యుమెంటరీ రుజువులు చూపాల్సిన అవసరం లేదు. ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ప్రకారం... డ్రైవింగ్ లైసెన్స్, యుఎస్ పాస్‌పోర్ట్ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐడి, యుఎస్ పౌరుడిగా లేదా అక్కడ జీవిస్తున్నట్లుగా జనన ధ్రువీకరణ పత్రం, సైనిక ఐడిలు చెల్లుబాటవుతాయి. ఈ పద్ధతి అమలులోకి వస్తే ప్రతి ఎన్నికల్లోనూ రిపబ్లికన్లే గెలుస్తారని ట్రంప్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్కరణలపై అమెరికాలోని రాజకీయ పరిశీలకులు, శాసనకర్తల్లో చర్చ మొదలైంది. కఠిన నిబంధనలు విధిస్తే ఓటర్లు ఎన్నికల ప్రక్రియకు దూరమవుతారని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటింగ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలంటే శాసనపరమైన చర్యలు అవసరమవుతాయని, ఫెడరల్ అధికారులు -- రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఉండాలని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# మునగనూరులో నూతన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ప్రారంభం

- ప్రారంభించిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి, మార్చి14(నేటి దర్శిని):**
ఆదిబాట్ల సర్కిల్ పరిధిలోని మునగనూరులో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని శనివారం ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యాలయం ప్రారంభంతో మునగనూరు, తొర్రూరు, రాగన్నగూడ, తుర్కయంజాల్, మన్నెగూడ తదితర గ్రామాల ప్రజలు ఇకపై రిజిస్ట్రేషన్ పనుల కోసం వనస్థలిపురం వెళ్లాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలను



ఏర్పాటు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాంత ప్రజలు రిజిస్ట్రేషన్ పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు మునగనూరులో కార్యాలయం ప్రారంభం కావడంతో సమయం, ఖర్చు రెండూ తగ్గి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించేందుకు కట్టుబడి ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. మునగనూరుకు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం రాకుండా కొందరు అడ్డంకులు సృష్టించినప్పటికీ పట్టుదలతో ఈ కార్యాలయాన్ని ఇక్కడికి తీసుకువచ్చామని ఆయన అన్నారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి అవినీతి చోటుచేసుకోకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాం రెడ్డి, స్థానిక మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో వంట గ్యాస్ కొరత లేదని తెలిపిన జిల్లా కలెక్టర్

● అపోహలు నమ్మొద్దని కలెక్టర్ స్పష్టత




**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు. గ్యాస్ కొరత ఉందనేది, కేవలం అపోహ మాత్రమే నని ,కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ దీనిపై స్పష్టత ఇచ్చిందని పేర్కొన్నారు. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అపోహలను నమ్మి ముందుగానే సిలిండర్లు బుక్ చేసుకోవద్దని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సరాపరా యధావిధిగా కొనసాగుతుందని ప్రజలకు వివరించారు.

## రంజాన్ తోఫా కిట్స్ ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి




**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** రాష్ట్రంలో అన్ని మతాలు, కులాలకు సమన్యాయం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం సోదర సోదరీమణులకు అందజేస్తున్న రంజాన్ తోఫా కిట్స్ ను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. వరంగల్ నగరంలోని 63వ డివిజన్ జామా మసీద్ ద్ ,53వ డివిజన్ మజీద్ ఏ నూర్ మసీదులో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ముస్లిం సోదర, సోదరీమణులు పాల్గొన్నారు.

## బస్సును లారీ ఢీకొనడంతో ప్రయాణికులకు తీవ్ర గాయాలు







**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** ఉమ్మడి వరంగల్ జిల్లా కొడకండ్ల మండల పరిధిలోని గుమ్మల బండ తండా బస్టాండ్ సమీపంలో హనుమకొండ డిపోకు చెందిన బస్సును లారీ ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హనుమకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సూర్యాపేట జిల్లా తిరుమలగిరి కి వెళుతున్న సమయంలో తిరుమలగిరి నుంచి తొర్రూరు వెళు తున్న లారీ అతివేగంగా వచ్చి బస్సును ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గాయాలైనాయని , బస్సు డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు వెంటనే అంబులెన్స్ కు ఫోన్ చేసి సమాచార అందించడంతో, అంబులెన్స్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆసుపత్రులలో చేర్పించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## దక్షిణముఖ భక్తాంజనేయ స్వామికి విశేష పూజలు




**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని 20వ డివిజన్ కాశీబుగ్గలోని రంగనాయక స్వామి దేవాలయంలో దక్షిణాముఖ భక్తాంజనేయ స్వామికి ఏకాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు .ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకులు, వివిధ రకాల పూలతో అలంకరించి విశేష అర్చనలు చేశారు .ఈ పవిత్ర దినాన్ని స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతం...!





● పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు

● పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి

**ఉమ్మడి వరంగల్, మార్చి 14(నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలో పదవ తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లా పరిధిలోని నర్సంపేటలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు మౌలిక వసతులు భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పరీక్ష నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వరంగల్ నగరంలోని కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని ఆర్డీఓ సందర్శించి ,పరీక్ష నిర్వహణను పరిశీలించారు. అలాగే శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని జడ్పి సీఈఓ రామ్ రామ్ రెడ్డి తనిఖీ చేశారు. హనుమకొండ జిల్లాలోని లస్కర్ బజార్లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సందర్శించి , పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రారంభం కావడంతో వరంగల్ నగర విద్యార్థులు ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. తర్వాత పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ వాహనాల ద్వారా పరీక్షా కేంద్రాలకు చేర్చడంతో సందడి నెలకొంది.

# గంట రవికుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏ ఐ పై ఉచిత అవగాహన సదస్సు




**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** యువత నిరుద్యోగులకు కాలానుగుణంగా మారుతున్న టెక్నాలజీని అందించాలనే ఉద్దేశ్యముతో ఏఐ కెరియర్స్, కంప్యూటర్ విజన్, ఐటి కెరీర్ పై అవగాహన సదస్సును ఉచితంగా నిర్వహిస్తుందని, దానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు గంట రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంట రవికుమార్ ఫౌండేషన్ స్థాపించిన దగ్గర నుంచి ఎన్నో రకాల సాంఘిక , సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా , ఇప్పుడు ఏఐ పై విద్యార్థుల్లో ఉన్న అపోహలు, అనుమానాలు నివృత్తి చేసేందుకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తుందన్నారు.రక్తదాన శిబిరాలు, చలివేంద్రాలు, ఉచిత ట్యూషన్ నిర్వహణ , పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక స్వాలంబన, కోవిడ్ సమయంలో నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజలతో నిత్యం మమేకమైన గంట రవికుమార్ ఫౌండేషన్ తాజాగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. యువత భవిష్యత్తుకు బాటలు వేస్తూ, కంప్యూటర్లో అతి తక్కువ ధర ల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తుండగా, ప్రస్తుతం ఈ అవగాహన సదస్సుకు ఫౌండేషన్ పూనుకున్నట్టు పేర్కొన్నారు. ఏఐ రంగం లో అనుభవం ఉన్న వారు ఈ సదస్సులో పాల్గొంటారని రవి కుమార్ పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ అన్ని బ్రాంచుల్లో పేరు నమోదు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ కోరారు.

# అందరి క్షేమాన్ని కోరుకునేదే సనాతన ధర్మం

● బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ నగరంలోని శ్రీ శ్రీ శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలకు బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగర ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. అలాగే సనాతన ధర్మంపై పెరుగుతున్న దాడులను ఎదుర్కోవడానికి, మన సంప్రదాయాలను, సంస్కృతిని, ఆలయాలను కాపాడుకోవడానికి హిందువులందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, సనాతన ధర్మం 'అందరి క్షేమాన్ని కోరుకుంటుందన్నారు, ఇతర మతాలను గౌరవిస్తుందనీ, ధర్మబద్ధంగా జీవించడాన్ని బోధించే సనాతన ధర్మాన్ని రక్షించుకోవడం మన ప్రాథమిక హక్కు , కర్తవ్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బిజెపి జిల్లా నాయకులు కనుకుంట్ల రంజిత్ కుమార్ , ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థికి ఒక నిర్దిష్టమైన స్థానం ఉండాలి: ఏసీపి ప్రశాంత్ రెడ్డి




**ఉమ్మడి వరంగల్, మార్చి 14 ( నేటి దర్శిని బ్యూరో):** ప్రతి విద్యార్థికి ఒక కల ఒక నిర్దిష్టమైన స్థానం ఉండాలని వారి లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని కాజీపేట ఏసిపి పి. ప్రశాంత్ రెడ్డి అన్నారు. తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల వార్షిక దినోత్సవాన్నికి ముఖ్యఅతిథిగా ఏసిపి పాల్గొన్నారు. పల్స్ 2026 - సోమిడి కాజీపేటలోనీ, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల వార్షిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాజీపేట ఎసిపి పి. ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5000 మందికి పైగా విద్యార్థులకు ఉన్నత నాణ్యత గల విద్యను అందించడంలో 500 మందికి పైగా ఉద్యోగులకు ప్రత్యక్ష ఉపాధిని అందించడంలో అంకితభావంతో ప్రేరణతో చేసిన కృషికి తాళ్ల పద్మావతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్స్ చైర్మన్ తాళ్ల మల్లెశం ను ఆయన అభినందించారు. భారతదేశం ప్రపంచంలోనే అతి చిన్న దేశం మాత్రమే అని , మన దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి ఈ అరుదైన అవకాశాన్ని మనం ఉపయోగించుకోవాలని ఆయన అన్నారు. ఒక యువ ఇంజనీర్‌గా, విద్యార్థులు సామాజిక సమస్యలకు వినూత్న పరిష్కారాలను సృష్టించడంలో దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలను గౌరవించాలని , మన దేశానికి క్రమశిక్షణ కలిగిన పౌరుడిగా ఉండాలని ఆయన మరోసారి యువతను కోరారు. టాలీవుడ్ గాయకుడు స్వరగ్ కీర్తన్ ప్రదర్శించిన సంగీత ప్రదర్శన కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ తాళ్ల మల్లెశం, డైరెక్టర్లు డాక్టర్ తల్ల వంశీ- చైతన్య, డాక్టర్ వరుణ్-వైష్ణవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేలు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ లక్ష్మి, మహేందర్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
# వినతికి కేంద్రం స్పందన

● ధాన్యం రవాణాకు రైల్వే రేక్స్ కేటాయింపు



**ఉమ్మడి వరంగల్, మార్చి 14 (నేటి దర్శిని బ్యూరో):**
తెలంగాణలో ధాన్యం ప్యాడి, పత్తి రవాణాకు అవసరమైన రైల్వే రేక్స్ ను సమృద్ధిగా కేటాయించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్యకు లేఖ ద్వారా రైల్వే రేక్స్ ను సమృద్ధిగా కేటాయిస్తామని హామీ ఇచ్చారు. లోక్‌సభలో రూల్ 377 కింద 2025 డిసెంబర్ 9న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రస్తావించిన అంశానికి స్పందిస్తూ మార్చి 6న మంత్రి లేఖ రాశారు. తెలంగాణలో ధాన్యం, పత్తి వంటి వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అదనపు " రైల్వే రేక్స్" అందించాలని ఎంపీ డా. కడియం కావ్య కోరారు. ఈ నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ, రాష్ట్ర ప్రభుత్వాలు, భారత ఆహార సంస్థ సమర్పించే అవసరాల ఆధారంగా ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రేకులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ అవసరాలు, రైల్వే బోగీల లభ్యత, రైల్వే మార్గాల సామర్థ్యం, నిర్వహణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేటాయింపులు జరుగుతాయని వివరించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2026 జనవరి వరకు తెలంగాణలో భారత ఆహార సంస్థ ద్వారా సుమారు 3.59 మిలియన్ టన్నుల ధాన్యం (సుమారు 1,329 రైల్వే రేకులు) లోడింగ్ జరిగినట్లు మంత్రి తెలిపారు. ధాన్యం సహా ఆహార ధాన్యాల రవాణా నిరంతరంగా సాగేందుకు రోజువారీగా రైల్వే రేక్స్" అందిస్తున్నామని స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు భారతీయ రైల్వేలు కట్టుబడి ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. రైతుల పంటల రవాణా సులభతరం కావడానికి ఈ చర్యలు ఎంతగానో ఉపయోగపడతాయని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు.

# సీనియర్ సిటిజన్స్ సమాజానికి మార్గదర్శకులు: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్.బి.నగర్,మార్చి14 (నేటి దర్శిని):**
విశేషమైన అనుభవంతో, జ్ఞానంతో పరిణతితో సమాజ హితాన్ని కోరుతూ భవిష్యత్తు తరాలకి మార్గదర్శకులుగా ఉంటున్న పెద్దలైన... సీనియర్ సిటిజల్లు సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని, వారి దిశానిర్దేశం యువతకు ఎంతో అవసరమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కొనియాడారు. బి.యన్.రెడ్డి నగర్ కాలనీ లో నూతనంగా ఏర్పాటు అయిన సీనియర్ సిటిజన్ కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో సీనియర్ సిటిజన్స్ కోసం ఒక సువిశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశామని అప్పటి ప్రభుత్వ నుంచి సానుకూలమైన స్పందన వచ్చిందని,అయితే ప్రభుత్వం మారిపోవటం వల్ల ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదని ఆయన అన్నారు. భవిష్యత్తులో తప్పకుండా అటువంటి భవన నిర్మాణం తాను చేపడతానని ఆయన సభాముఖంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి.ఆర్.ఎస్ డివిజన్ అధ్యక్షులు శ్రీ కటికి రెడ్డి అరవింద రెడ్డి మాట్లాడుతూ ఎల్లవేళలా సీనియర్ సిటిజన్స్ కోసం వారి కుటుంబ సభ్యుడిగా అందుబాటులో ఉంటానని, ఏ అవసరం ఉన్న నన్ను సంప్రదించాలని కోరారు. ఈ





కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కనకరత్నం, బి.యన్ రెడ్డి నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షులు నారాయణ, సెక్రటరీ రాజిరెడ్డి, సభ్యులు కొండలరావు, అలెగ్జాండర్, యోగానందం, అజయ్, శివాలయం టెంపుల్ చైర్మన్ నందా రెడ్డి, సెక్రటరీ మంగపతి రావు, కాలనీ జనరల్ సెక్రటరీ ధనరాజ్, జాయింట్ సెక్రటరీ గుర్రం రవీందర్ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ శ్రీనివాస్,ఎస్ కే డి నగర్ గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, అధ్యక్షులు అమరేందర్ రెడ్డి, గాంధీనగర్ అధ్యక్షులు మల్లా రెడ్డి పార్టీ నాయకులు అనిల్ చౌదరి మాధవరం నరసింహారావు, ముద్దగౌని సతీష్ గౌడ్, గంగం శివశంకర్,కొంగర మహేష్, పార్టీ యూత్ అధ్యక్షులు రాఘవేందర్ రావు, సంతోష్ రావు, గగన్,కొంగరి నరేష్, రాంకోటి, బోయపల్లి శ్రీకాంత్ రెడ్డి, ప్రకాష్, అమర్థ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రూ.950 కోట్లతో ఎల్బీనగర్-హయత్‌నగర్
# డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ ప్రతిపాదన

- హయత్‌నగర్‌లో రూ.10 కోట్ల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన
- త్వరలో కేంద్ర ఆమోదం - రెండు నెలల్లో పనులు ప్రారంభం: మంత్రి వెంకట్ రెడ్డి
- రోడ్ల అభివృద్ధికి ఎల్బీనగర్-ఇబ్రహీంపట్నం ప్రాంతాలకు రూ.400 కోట్ల నిధులు
- మూసీ పునరుజ్జీవానికి చర్యలు - ప్రతిపక్షాల విమర్శలకు కాంగ్రెస్ నేతల సమాధానం
- రూ.950 కోట్లతో ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్: మంత్రి కోమటిరెడ్డి







**హయత్‌నగర్, మార్చి 14 (నేటి దర్శిని):**
ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు రూ.950 కోట్ల వ్యయంతో మెట్రో రైల్‌తో కూడిన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టుకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. శనివారం హయత్‌నగర్‌లోని సాయిబాబా గుడి చౌరస్తా నుంచి జి స్కూల్ వరకు రూ.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పాత నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెట్రో రైల్‌తో కూడిన డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముందస్తుగా రూ.200 కోట్లను చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి ప్రాజెక్టుకు కేంద్ర ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. రెండు నెలల్లో పనులు ప్రారంభమయ్యే అవకాశముందని వెల్లడించారు.ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో రోడ్ల విస్తరణ కోసం ఆర్ అండ్ బీ శాఖ తరపున రూ.400 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. హయత్‌నగర్ నుంచి తారామతిపేట్ వరకు, కోహెడ ఫ్రూట్ మార్కెట్ రోడ్, ఇంజాపూర్ రోడ్ తదితర రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు.హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి విస్తరణ కోసం ఎంపీగా ఉన్నప్పటి నుంచే పోరాడి మంజూరు చేయించుకున్నానని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయని, రూ.10 వేల కోట్లతో విజయవాడ వరకు సర్వీస్ రోడ్లను కూడా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల పంపిణీ వంటి సంక్షేమ పథకాలతో పేదలు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. కాలుష్యానికి గురైన మూసీ నదిని పునరుజ్జీవం చేయడం అవసరమని పేర్కొన్నారు. ఇల్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా మంత్రి విమర్శలు చేశారు.మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ రోడ్డు ఏర్పాటుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. హయత్‌నగర్ వద్ద పాత హైవేతో పాటు బాతుల చెరువు నుంచి ఇంజాపూర్ వైపు కూడా రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఈ డబుల్ డెక్కర్ రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయే వారికి న్యాయం చేయాలని, టిడిఆర్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్సీ మోహన్ నాయక్, నేషనల్ హైవే సీఈ ధర్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఠాకూర్ అశ్విన్ సింగ్ జన్మదిన వేడుకలు





**కొత్తపేట, మార్చి14 (నేటి దర్శిని):**
కొత్తపేట్ డివిజన్ పరిధి మోహన్ నగర్ ప్రజయ్ నివాస్ లో ఠాకూర్ అశ్విన్ సింగ్ జన్మదిన వేడుకలు ఎంతో అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా తాజా మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్, శ్రీనివాస్ చౌదరి పాల్గొని అశ్విన్ సింగ్ ను శాలువలతో గజమాలతో సన్మానించి కేక్ కట్ చేయించారు. అశ్విన్ సింగ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని అశ్విన్ సింగ్ ను శాలువలతో ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం ఠాకూర్ అశ్విన్ సింగ్ ఇక్కడికి విచ్చేసి నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# గోమాత రక్షణకు కఠిన చట్టం కావాలి ఢిల్లీలో పవన్ కుమార్ గుప్తా వినతి



**హైదరాబాద్, మార్చి14 (నేటి దర్శిని):**
దేశవ్యాప్తంగా గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేసే విధంగా ప్రత్యేక చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ నమో మిషన్ వందే గోమాతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పవరపు పవన్ కుమార్ గుప్త కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మని మర్యాదపూర్వకంగా కలిశారు.పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఈ నెల 12వ తేదిన న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో గోమాత సంరక్షణకు సంబంధించి పలు అంశాలను కేంద్ర మంత్రికి వివరించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో గోమాతకు అత్యంత ప్రాధాన్యం ఉందని, గోవధను పూర్తిగా నిషేధించేలా కఠినమైన చట్టం తీసుకురావాలని పవన్ కుమార్ గుప్తా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నమో మిషన్ వందే గోమాతరం వ్యవస్థాపకుడు వీర మృద్విరాజ్ ఆచార్య పాల్గొని గోమాత పరిరక్షణ కోసం సంస్థ దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. గోమాత సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థకు చెందిన ఇతర ముఖ్య నాయకులు కూడా పాల్గొని గోమాత రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గోమాత పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా మరింత బలమైన చట్టం తీసుకురావాలని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# నాయకుని తండాలో నూతన గ్రామ పంచాయితీ భవనానికి శంఖుస్థాపన



**తిరుమలగిరి సాగర్, మార్చి 14 (నేటి దర్శిని):**
తిరుమలగిరి సాగర్ మండలంలోని నాయకుని తండాలో నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి శనివారం శంఖుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ ఆదేశాల మేరకు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయితీ భవనానికి గ్రామ సర్పంచ్ మేరావత్ పూల బిచ్యాలు నాయక్ శంఖుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి పంచాయితీ భవనం కీలకంగా మారుతుందని, ప్రజలకు పరిపాలన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హచ్చు నాయక్, మాజీ సర్పంచ్ కొండా నాయక్, ఉప సర్పంచ్ మోతిలాల్, గ్రామ నాయకులు మునినాయక్, నాగేందర్ నాయక్, రంగసాయి, దేవుజా నాయక్, సేవా నాయక్, సక్రు నాయక్, స్వామి నాయక్, బాలచందర్, ముని తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అల్పాహారం ఏర్పాటు చేసిన కృష్ణ గోపాల్ సేవా సమితి







**ఎల్.బి.నగర్,మార్చి14 (నేటి దర్శిని):**
కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ పిల్లల హాస్టల్‌లో అల్పాహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 250 మంది పిల్లలు పాల్గొని ఆనందంగా అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, అనాథ పిల్లలు ఆనందంగా భోజనం చేస్తుండటం చూసి సమాజంలోని ప్రతి ఒక్కరు సంతృప్తి చెందుతారని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సభ్యులందరికీ ఎంతో ఆనందం మరియు తృప్తి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్‌తో పాటు సభ్యులు సునీల్ దారాడే, సురేష్ ధవాలే మరియు ఎం. పవన్ తదితరులు పాల్గొని సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్ గ్రహీత వేణు ఊడుగుల ను సన్మానించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్





- **మట్టిలో మాణిక్యాలను సినీ పరిశ్రమకు పరిచయం చేస్తున్న వేణు ఊడుగుల ఆదర్శనీయుడు**
- **బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్**

**వరంగల్, మార్చి14 (నేటి దర్శిని):**
2025 సంవత్సరానికి గాను తెలంగాణ ప్రభుత్వం బిగద్దర్ తెలంగాణ ఫిలి అవార్డ్స్ ప్రకటించగా వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, ఉప్పరపల్లి గ్రామ వాస్తవ్యులు వేణు ఊడుగుల నిర్మించిన చిత్రం "రాజు వెడ్స్ రాంభాయి" కి ఉత్తమ చిత్రం అవార్డుతో పాటు ఉత్తమ డైరెక్టర్ గా సాయిలు కంపాటి, ఉత్తమ నేపథ్య గాయకుడి గా అనురాగ్ ,ఉత్తమ మేల్ యాక్టర్ గా చైతు జొన్నల గడ్డ లకు అవార్డ్స్ రావడం సంతోషకరమైన విషయం అని,ఈ సందర్భంగా శనివారం నాడు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని జూబ్లీ హిల్స్ లోనీ వారి ఆఫీస్ కి వెళ్ళి వేణు ఊడుగుల కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ అచ్చమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యం గల సినిమాలకు ఆదరణ పెరుగుతున్నందుకు సంతోషం అని, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వేణు ఊడుగుల కిందిస్థాయిలో ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి చేరుకున్నారని,కష్టం విలువ తెలిసిన వ్యక్తిగా సినీ రంగంలో ఎందరినో ప్రోత్సహిస్తున్నారని, ఆ కోవలోకే రాజు వెడ్స్ రాంబాయి డైరెక్టర్ సాయిలు కాంపాటి వస్తారని,ఇంకా సినీ పరిశ్రమలో మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి, సినీ గేయ రచయిత మట్టపల్లి సురేందర్ లాంటి ఔత్సాహికులను ప్రోత్సహిస్తు మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి వారికి అవకాశాలు ఇవ్వడం పలువురు సినీ ప్రముఖులకు ఆదర్శనీయం అని అన్నారు.సామాజిక విలువలతో సినిమాలు తీస్తున్న వేణు ఊడుగుల కు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ మిత్రులు అభిమానులు, బంధువులు,సహచరులు ప్రత్యక్షంగా పరోక్షంగా అభినందనలు తెలియజేస్తున్నారని, భవిష్యత్తులో వేణు ఊడుగుల నిర్మాతగా ,డైరెక్టర్ గా మరిన్ని ఉత్తమమైన సినిమాలు తీసి ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలని ఆశిస్తున్నామని అన్నారు. గద్దర్ అవార్డు గ్రహీత, డైరెక్టర్, నిర్మాత వేణు ఊడుగుల మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలో టాలెంట్ ఉన్న యువకులకు సినీ రంగంలో అవకాశాలు కల్పిస్తామని అందుకు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని, మనుషులను బి మనసులను కలిపే వారధి సమాజ సేవకుడు దేవేందర్ ముదిరాజ్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు దుండి అశోక్, పోలేపాక రాజు, బోనాల రమేష్,పంతంగి భాస్కర్, వెల్దండి మధు,పులి రంజిత్, రాచర్ల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలి

- **హామీలు అమలు చేయకపోతే మార్చి 16 నుంచి నిరాహార దీక్ష**



**హైదరాబాద్, మార్చి14 (నేటి దర్శిని):**
కాంగ్రెస్ మేనిఫెస్టో సాధన సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వికలాంగ రాజ్యాధికార ఫోరమ్ అధ్యక్షులు వంశరాజ్ రామచంద్ర మాట్లాడుతూ, 2016లో అమలులోకి వచ్చిన వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడం అత్యవసరమని తెలిపారు. అలాగే ప్రభుత్వ విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి కనీసం 5 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల ప్రయాణ సౌకర్యాల కోసం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలని, అలాగే ఇలా ఏఐసీసీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా స్థానిక సంస్థల్లో వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చ జరపకపోతే, మార్చి 16 నుంచి హైదరాబాద్‌లోని ఇంద్రా పార్క్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపడతామని వికలాంగ రాజ్యాధికార ఫోరమ్ తరఫున వంశరాజ్ రామచంద్ర హెచ్చరించారు.

# క్రైస్తవుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- **క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**
- **క్రైస్తవ సమాజానికి పాటుపడుతున్న దీపక్ జాన్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి**
- **ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఐసీపీసీ చైర్మన్ రెవ.కె.దినాకర్**



**ఇబ్రహీంపట్నం, మార్చి14 (నేటి దర్శిని):**
క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఐసీపీసీ చైర్మన్ రెవ.కె.దినాకర్, ఐయంపీసీ చైర్మన్ రెవ్.డి.కరుణాకర్, అసెంబ్లీ కోఆర్డినేటర్ పాస్టర్ ఎం.విక్టర్ సన్నుత్, తదితరులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఐసీపీసీలో ఉన్న సమస్యలు, ముఖ్యంగా గ్రేవియార్డ్స్‌కు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్రైస్తవ సమాజ సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని ఆయన వివరించారు. బీద విద్యార్థులకు స్టైఫండ్లు, మహిళలకు కుట్టు మిషన్లు, ఉపాధి కోసం లోన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రిజిస్ట్రేషన్ ఉన్న ప్రతి చర్చికి చర్చి అలంకరణ కోసం రూ.30 వేలు, క్రిస్మస్ సందర్భంగా లవ్ ఫీస్ట్ నిర్వహణకు రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీసీ సర్టిఫికెట్ పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొనే వారికి స్వయంగా రెవిన్యూ అధికారులతో మాట్లాడి సర్టిఫికెట్లు అందేలా సహాయం చేస్తున్నామని ఆయన తెలిపారు. క్రైస్తవులపై లేదా చర్చిలపై దాడులు జరిగితే పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. సమస్యలతో వచ్చే ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా స్వాగతించి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇంకా రాబోయే రెండు మూడు నెలల్లో జీఓ జారీ చేసి అర్హులైన పేద క్రైస్తవులకు వ్యాపారం ప్రారంభించేందుకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ప్రయాణ సౌకర్యం కోసం ఎలక్ట్రిక్ స్కూటర్లు, పాస్టర్లకు నెలసరి వేతనం అందించే అంశాలపై కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే రెండేళ్లలో క్రైస్తవుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేద క్రైస్తవులను ఆర్థికంగా బలపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా ఐసీపీసీ అధ్యక్షులు రెవ.కె.దినాకర్ మాట్లాడుతూ.. క్రైస్తవ సమాజ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తున్న క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ చైర్మన్ దీపక్ జాన్ క్రైస్తవులకు ఒక దీపం, దిక్సూచి వంటివారని అభినందించారు. భవిష్యత్తులో ఆయన ఇంకా ఉన్నత పదవులు చేపట్టి పేద క్రైస్తవులకు మరిన్ని సేవలు అందించాలని దేవునికి ప్రార్థిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీపీసీ కార్యదర్శి రెవ.ఆర్.దేవకుమార్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా బి. ఇంద్రసేన్ రెడ్డి నియామకం

**హైదరాబాద్, మార్చి14(నేటి దర్శిని):**
తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర ప్రతినిధిగా ప్రముఖ వ్యాపారవేత్త బి. ఇంద్రసేన్ రెడ్డిను నియమించారు. టెక్నాలజీ, సోలార్ ఎనర్జీ మరియు రియల్ ఎస్టేట్ రంగాలలో దాదాపు మూడు దశాబ్దాల అనుభవం కలిగిన ఆయనకు ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఇంద్రసేన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి మరియు విశ్వశక్తిపై విశ్వాసంతో నిజాయితీ, సమానత్వం వంటి విలువలతో తెలంగాణలో బీజేపీ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను



సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. ఈ బాధ్యతను అప్పగించినందుకు తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్ రావుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ప్రతినిధి బాధ్యతను అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇంద్రసేన్ రెడ్డి ప్రస్తుతం లఘు ఉద్యోగ్ భారతీ, భారత్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ఫోరం, స్వావలంబి భారత్ అభియాన్ వంటి సంస్థలతో అనుబంధంగా పనిచేస్తున్నారు. పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, విధాన పరిరక్షణ మరియు వ్యాపార సహకారం ద్వారా వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగస్వామ్యమవుతూ సేవలు అందిస్తున్నారు.

# వ్యవసాయానికి ప్రారంభం ఉగాది పండుగనే: డా. నందిని సిధారెడ్డి

**హైదరాబాద్, మార్చి14 (నేటి దర్శిని):**
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి , జాతీయ తెలుగు సారస్వత పరిషత్, శ్రీమతి నక్క వెంకటమ్మ యాదవ్ నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ ఫౌండేషన్, లక్ష సాధన ఫౌండేషన్, మహిళాభారతి, గోల్కొండ సాహితీ కళా సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం, పాలడుగు నాగయ్య కళాపిఠం, దర్పణం సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడే సాబ్ నిర్వహణలో 'పరాభవ నామ సంవత్సర ఉగాది శతాధిక కవి సమ్మేళనం మరియు అష్టావధానం జరిగింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ సిధారెడ్డి, విశిష్ట అతిథులుగా తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సిధారెడ్డి మాట్లాడుతూ... ఉగాది అనేది వ్యవసాయానికి తొలిరోజని, భారత దేశంలో పంచాంగం చంద్రమానం, సౌరమానం అని రెండు రకాలుగా జరుపుకుంటారని, దక్షిణ భారతదేశంలో చంద్రమానాన్ని పాటిస్తామని తెలియజేశారు. ఉగాది





అనేది మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలయంగా ఉందని, ఉగాది వరకు ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం శతాధిక కవులతో కవి సమ్మేళనం జరిగింది. అలాగే అవధాని మలుగ అంజయ్యచే అష్టావధానం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సభా సమన్వయకర్తగా డా. బి. జయ రాములు వ్యవహరించారు. ఉదయం జరిగిన ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, విశిష్ట అతిథిగా నక్క శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... తెలుగు ప్రజలకు మొదటి పండుగ ఉగాది పండుగనేనని తెలియజేశారు. పరాభవ నామ సంవత్సరం అంటే దేశంలో ఉన్న అన్యాయం, అధర్మం పరాభవం చెంది శాంతి నెలకొనడం అని అన్నారు. ఈ సభకు రామకృష్ణ చంద్రమౌళి సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుసుమ ధర్మన్న కళా పీఠం చైర్పర్సన్ రాధా కుసుమ, పాలడుగు సరోజినీ దేవి, కేసినేని రాంప్రసాద్, ఉపేంద్ర స్వామి, గజవల్లి సత్యనారాయణ, బైలూరి యోగేష్ ప్రభు, ప్రజ్ఞా రాజు, ప్రొఫెసర్ రాజారత్నం, పెబ్బేటి మల్లికార్జున్, గంటా మనోహర్ రెడ్డి,చంద్ర ప్రకాష్ రెడ్డి, తిక్కయ్య మొదలైన వారు పాల్గొన్నారు.




# మరోమారు అనుష్క పెళ్లి వార్తలు

### పెళ్లి పీటలు ఎక్కనుందంటూ సోషల్ మీడియాలో హల్‌చల్

దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు 'లేడీ సూపర్ స్టార్'గా వెలుగొందిన అనుష్క శెట్టి వివాహ వార్తలు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా ఆమె పెళ్లిపై అనేక ఊహాగానాలు వచ్చినప్పటికీ, ఈసారి మాత్రం ఆమె త్వరలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నట్లు సినీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం.. 44 ఏళ్ల అనుష్క ఈ ఏడాది పెళ్లి పీటలు ఎక్కేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వరుడు ఆమె కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన బెంగళూరుకు చెందిన ఒక ప్రముఖ వ్యాపారవేత్త అని, ఇది పూర్తిగా పెద్దలు కుదిర్చిన సంబంధమని సమాచారం. ఇప్పటికే ఇరు కుటుంబాల మధ్య చర్చలు పూర్తయ్యాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. చాలా కాలంగా అనుష్క పేరు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో కలిపి వినిపిస్తున్న ప్పటికీ, వారిద్దరూ కేవలం ప్రాణ స్నేహితులమని పలుమార్లు స్పష్టం చేశారు. తాజా పరిణామాలతో ఈ రూమర్లకు చెక్ పడే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు, అనుష్క గత చిత్రం 'ఘాటి' ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆమె ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె కేవలం మలయాళ చిత్రం 'కథనార్' షూటింగ్‌లో మాత్రమే పాల్గొంటున్నారు. ఈ సినిమా పనులు పూర్తయిన వెంటనే ఆమె వివాహం చేసుకునే ఛాన్స్ ఉందని నెటిజన్లు చర్చించుకుంటున్నారు.



# డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తున్న హెబ్బా పటేల్..

టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో హెబ్బా పటేల్ ఒకరు. తక్కువ సమయంలోనే విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. ఇప్పటివరకు సరైన బ్రేక్ రాలేదు. కానీ విభిన్న కంటెంట్ చిత్రాలు, లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తుంది. ప్రస్తుతం తన కొత్త సినిమాను ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ. అర్జున్ ఆర్ట్స్ సమర్పణలో చిత్రాలయ క్రియేషన్స్ బ్యానర్ మీద శ్రీలక్ష్మీ.ఎం నిర్మాతగా ప్రొడక్షన్ నెంబర్ 3 రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాకి 'దర్జా' ఫేమ్ మ్యాక్ (సలీం మాలిక్) దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హెబ్బా పటేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని మేకర్లు తాజాగా ప్రకటించారు. ఎమోషన్, కామెడీ ఎంటర్టైన్మెంట్ జానర్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ సినిమాని భారీ ఎత్తున రూపొందించబోతోన్నారు. ఈ మేరకు నటీనటులు, ఇతర సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాల్ని ప్రకటించారు.దర్జా' మూవీతో అందరినీ మెప్పించిన మ్యాక్ (సలీం మాలిక్) ఈ మూవీకి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ బాధ్యతల్ని నిర్వర్తించనున్నారు. ఆడియెన్స్‌కి కొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా, డిఫరెంట్ సబ్జెక్ట్‌లతో ఆకట్టుకునే దర్శకుడు మ్యాక్ (సలీం మాలిక్) ఈ సారి ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నాడు. ఈ ప్రాజెక్ట్‌కి మాటలు, పాటల్ని భాష్యశ్రీ అందించనున్నారు. కేవీఆర్ అడిషనల్ స్క్రీన్ ప్లేని రాశారు. ఎం. సమీర్ ఈ చిత్రానికి సంగీతాన్ని సమకూర్చనున్నారు. విష్ణు పానికర్ కెమెరామెన్‌గా పని చేయనున్నారు. ఈ మూవీలో హీరోయిన్‌గా హెబ్బా పటేల్ నటించనున్నారు. మిగిలిన వివరాల్ని చిత్రయూనిట్ త్వరలోనే ప్రకటించనున్నారు.

# అదే నిజమైతే టైమ్ మొదలైనట్టే



పన్నెండేళ్ల క్రితం 'ఊహలు గుసగుసలాడే' అనే హిట్ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఢిల్లీ భామ రాశీఖన్నా. ఆ తర్వాత ఎన్టీఆర్, రవితేజ, ధనుష్ వంటి స్టార్లతో సినిమాలు చేసినా, అనుకున్నంత స్టార్‌డమ్ మాత్రం రాశీఖన్నాను వరించలేదు. నిజానికి అందంలోనూ, అభినయ సామర్థ్యంలోనూ నేటి స్టార్ హీరోయిన్లెవరికీ తీసిపోదు రాశీఖన్నా. కానీ ఇండస్ట్రీలో ఎదగాలంటే గుమ్మడికాయంత విద్వత్తుంటే చాలదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ అదృష్టం కోసం దశాబ్దానికి పైగా ఎదురుచూస్తూనే ఉంది ఈ అందాలభామ. ఈ నెల 19న రానున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' తన కెరీర్‌కి గేమ్‌ఛేంజర్ అని ఆమె గట్టిగా నమ్మతోంది. ఇదిలావుంటే, ఈ క్రేజీ సినిమా తర్వాత, వెంటనే మరో పానిండియా సినిమాలో రాశీఖన్నా భాగం కానున్నట్టు తెలిసింది. అల్లు అర్జున్ హీరోగా తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీలో కీలక పాత్ర కోసం రాశీఖన్నాను దర్శకుడు లోకేష్ కనకరాజ్ సంప్రదించారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని తెలిసింది. ఇదే నిజమైతే రాశీఖన్నా టైమ్ నిజంగా మొదలైనట్టే.




# 15న ఉస్తాద్ ప్రీరిలీజ్ వేడుకలు

### ఈవెంట్ బద్దలై పోవాలన్న హరీశ్ శంకర్

పవన్‌కల్యాణ్ అభిమానులకు మరో శుభవార్త. పవన్ కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్ర ప్రీ-రిలీజ్‌వేడుక ఖరారైంది. మార్చి 15న హైదరాబాద్ పోలీస్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 5గంటల నుంచి ఈవెంట్ మొదలవుతుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసింది. అలాగే దర్శకుడు హరీశ్ శంకర్ కూడా ఈ విషయాన్ని తెలియజేస్తూ 'ఈసారి ఈవెంట్ బద్దలైపోవాలి ఫ్రెండ్స్' అని పేర్కొన్నారు. ఇక శనివారం సాయంత్రం 'ఉస్తాద్' ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేసింది. రాశీఖన్నా, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్న ఈ మూవీ మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. 'గబ్బర్ సింగ్' తర్వాత హరీశ్-పవన్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి.



# రాజ్ కుమార్ రావుతో కీర్తి సురేష్ జోడీ

### ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వంలో రఫ్తార్

బాలీవుడ్ విలక్షణ నటుడు రాజ్ కుమార్ రావు మరియు సౌత్ స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్ తొలిసారిగా జతకట్టబోతున్నారు. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'రఫ్తార్'. ఇంటెన్స్ థ్రిల్లర్ డ్రామాగా రాబోతున్న ఈ ప్రాజెక్టును రాజ్ కుమార్ రావు భార్య, నటి పత్రలేఖ తన సొంత నిర్మాణ సంస్థ 'కాంపా ఫిల్మ్స్'పై అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పణలో నిర్మించబోతుంది. విద్యా వ్యవస్థలోని చీకటి కోణాలు, కార్పొరేట్ పోటీ, సక్సెస్ కోసం ఆరాటపడే ఇద్దరు వ్యక్తుల మధ్య సాగే సంఘర్షణ నేపథ్యంలో ఈ సినిమా సాగనుంది. ముఖ్యంగా డబ్బు, అధికారం మనుషుల సంబంధాలను ఎలా మారుస్తాయనే అంశాన్ని దర్శకుడు ఆదిత్య నింబాల్కర్ ఈ థ్రిల్లర్‌లో చూపించబోతున్నారు. ఇక నేషనల్ అవార్డు గ్రహీతలైన రాజ్ కుమార్ రావు, కీర్తి సురేష్ కలిసి నటిస్తుండటంతో ఈ సినిమాపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వీరితో పాటు అనురాగ్ ఠాకూర్, తాన్యా మణిక్తలా మరియు రజత్ కపూర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. గతంలో 'సెక్టార్ 36'తో మెప్పించిన ఆదిత్య నింబాల్కర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో కథనం చాలా ఉత్కంఠభరితంగా ఉంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ భారీ చిత్రాన్ని జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365